# రూహీ ఆపా

రమణికి ఆ రాత్రి శివరాత్రే అయింది. సలిం మాటిమాటికీ జ్ఞాపకం వస్తున్నాడు... అక్కకూడా జ్ఞాపకమొచ్చింది. రాధక్క తనకంటే చక్కగా పాడేది. ముజ్రా (పాట కచ్చేరీలు) చేసేది. అమ్మ అంతటితో ఆగక ఒక ఖోజా సేఠ్‌తో రాధక్కకు "కన్నెరికం" ఏర్పాటు చేసింది. అక్క హడలెత్తి పోయి, ముహూర్తం నాటి రాత్రే సంగీతం మాస్టారుతో లేచిపోయింది, ఇంతవరకూ జాడలేదు.

ఆ తరువాత ఆరు నెలల్లో తననూ తయారు చేసింది అమ్మ. తానూ ముజ్రాలు మొదలు పెట్టింది. కనక వర్షం కురిసింది. ఒకసారి అమ్మ తనతోనూ కన్నెరికం విషయం ప్రస్తావించింది. కాని తాను ఖచ్చితంగా చెప్పేసింది, అదే గనక తల పెడితే, తాను అక్కలా పారిపోక, ఇక్కడే విషం తాగి చచ్చి పోతానని బెదిరించింది. అమ్మ ఏమనుకుందో ఏమో మళ్ళీ ఆ మాట ఎత్తలేదు.

రెండేళ్ళు గడిచాయి. ఒకరోజు...

మధ్యాహ్నం రెండింటికే అమ్మ తనను నిద్రలేపి, తయారు కమ్మని చెప్పింది. ఎందుకని అడిగింది. ఒక నవాబుగారు పాట వినడానికి వస్తున్నారని చెప్పింది. రమణికి ఆశ్చర్యం వేసింది. అంతకుముందు అలా ఎన్నడూ జరగలేదు. తల్లికేసి అనుమానంగా చూసింది. ఆ చూపులోని అర్థం గ్రహించుకున్న అమ్మ, పాట వినటం తప్ప మరేమీ ఉండదని హామీ ఇచ్చింది. సరేనని లేచింది.

మూడింటికల్లా ఇంటిముందు ఒక పెద్దకారు వచ్చి ఆగింది. తనను బాగా ముస్తాబు చేసి, ముజ్రా గదిలోకి తీసుకెళ్ళింది అమ్మ. నవాబుగారు సుఖాసీనులై ఉన్నారు. తల్లీ కూతుళ్ళు సలాములు చేసి ఎదురుగా కూచున్నారు. కాస్త తలపైకెత్తి క్రీగంట చూసింది రమణి. తననే నిశితంగా

చూస్తున్నారు నవాబుగారు. ఒక్కచూపులో గ్రహించుకుంది రమణి, నిజమైన నవాబంటే ఇలాగే ఉంటాడేమోనని. తెల్లని తెలుపు, అందమైన ముఖ కవళికలు, యాభై ఏళ్ళు దాటినా, మొహంలో కళ, ఠీవీ, హుందాతనం తగ్గలేదు. వెంటనే కళ్ళు దించేసుకుంది.

అమ్మ నవాబుగారి ఆజ్ఞ తీసుకుని, ప్రారంభించమని సారంగీ ఉస్తాద్ (గురువు) కు సౌజ్ఞ చేసింది. తాను మెల్లిగా ఒక గజల్ అందుకుంది. అది విన్నంతసేపూ నవాబుగారు కళ్ళు మూసుకునే ఉన్నారు. ఆ తర్వాత ఏదైనా శాస్త్రీయ సంగీతం వినిపించమని కోరారు. తాను భయపడ్డది, సరిగ్గా పాడగలనో లేదోనని. ఉస్తాద్ ఫరవాలేదు, పాడమన్నట్టు తన దిక్కు చూస్తూ, సారంగ్ రాగస్వరాలాపన మొదలెట్టాడు. తనూ మెల్లిగా కొంత సేపు రాగాలాపన చేసి ఖయాల్ (పాట) అందుకుంది. విలంబిత్, ధృత్ లయల్లో అరగంట సేపు ఆ ఒక్క పాటే పాడింది. నవాబుగారు చాలా మెచ్చుకున్నారు. పర్సులోంచి వందరూపాయల నోట్లు తీసి తమ ముందున్న ఆకు వక్కల పళ్ళెంలో పెట్టారు. వెంటనే తాను లేచి సలాం చేసి గది ఈవల కొచ్చేసింది. నవాబుగారు అమ్మతో ఏదో కాసేపు మాట్లాడి వెళ్ళిపోయారు.

అమ్మ తన దగ్గర కొచ్చింది, నవాబుగారు తనకు నెలకు వెయ్యి రూపాయల భరణమిస్తారనీ, వారాని కొకసారో రెండు సార్లో తాను వారి దేవిడీకి (భవంతి) మధ్యాహ్నం పూట వెళ్ళి, గంటో రెండుగంటలో పాట వినిపించి రావాలనీ, ముజ్రాలు పూర్తిగా మాని వేయాలనీ, కావాలంటే రేడియోలో ప్రోగ్రాములు ఇవ్వచ్చనీ చెప్పారట. ముజ్రాలు మానుకోవాలని వినగానే తన హృదయం ఎగిరి గంతేసింది. చాలు, ఆ ఒక్కషరతే చాలు, ఆ నాలుగు గంటల యమయాతన తప్పితే చాలుననుకుంది,

అమ్మ ఇంకా చెప్పుకు పోతోంది- ఆయన యూసుఫ్ నవాబ్ అని పేరుమోసిన జాగీర్దారట. ఇప్పుడు జాగీర్ లేకపోయినా, చాలా ధనవంతుడట, ఎన్నో భూములూ బంగళాలు ఉన్నాయట. భార్య చనిపోయిందట.

ఒక్కడే కొడుకు. పై వూళ్ళో చదువుకుంటున్నాడట. ఆ కొడుకు కోసమే మళ్ళీ పెళ్ళి చేసుకోలేదట. అంతా చెప్పి అడిగింది అమ్మ "ఏమంటావే ?" అని,

ఏమంటుంది తాను ? అంతకంటే తాను కోరుకునేదేముంది? తల వంచుకుని, "నీ ఇష్టం" అంది. అమ్మ తల నిమిరి, మెటికలు విరిచి, నొసట ముద్దుపెట్టుకుని లేచింది.

ఆ నాటినుంచి తన రోజువారీ కార్యక్రమం మారిపోయింది. రాత్రుళ్ళు ముజ్రాలు లేవు. మేలుకోవటాలు లేవు. పదింటి కల్లా పడుకునేది. ప్రొద్దున మధ్యాహ్నం రెండేసి గంటలు సంగీత సాధన తప్ప తక్కిన సమయం అంతా తనదే. వారానికొకసారి, ఆదివారం రోజున పన్నెండు గంటలకల్లా కారువచ్చేది, తాను అప్పటికే తయారై ఉండేది. మొదట్లో ఒకటి రెండు సార్లు తనవెంట అమ్మకూడా వచ్చింది. ఆ తర్వాత తనొక్కతే వెళ్ళేది.

అదొక పెద్ద దేవిడీ. లోపలి కెళ్ళేసరికి డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూచుని ఉండేవారు నవాబుగారు. తాను వెళ్ళి సలాంచేసి, మరో సోఫాలో కూచునేది. కుశల ప్రశ్నలు వేశాక, ఏవేవో మాటల్లోకి దింపేవారు. అంతసేపూ తన మొహంకేసే చూస్తూ ఉండేవారు. కొంచెం సేపటి తర్వాత నౌకరొచ్చి చెప్పగానే, ఇద్దరూలేచి లోపలికి వెళ్లేవాళ్ళు, అక్కడ 'దస్తర్ ఖాన్' (భోంచేసే తివాసీ) మీద రకరకాల వంటకాలు తయారుగా ఉండేవి. ఇద్దరూ కలిసి భోంచేసేవారు. తనని ఇంకా తినమని కోపతూండేవారు. భోజనానంతరం మళ్ళీ వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూచునే వారు. సరిగ్గా రెండు గంటలకి సారంగి ఉస్తాద్, తబలా వాయించేవాడూ వచ్చి తివాసీల మీద కూచునేవారు. తానూ తంబూరా తీసుకుని వాళ్ళ మధ్యలో కూచుని, నవాబ్ కోరిన పాటల్లా పాడుతూండేది. అలా రెండుగంటల సేపు కాలక్షేపం జరిగాక వాద్యగాళ్ళు వెళ్ళిపోయేవారు. నౌకర్లు ట్రేలో బిస్కెట్లూ, పళ్ళూ, టీ తీసుకొచ్చేవారు. ఇద్దరూ కలిపి టీ త్రాగేవారు. ఆ తర్వాత సెలవు తీసుకుని కార్లో ఇంటికొచ్చేది.

ప్రతి పండగకూ తనకు విధిగా మంచి మంచి కొత్త వస్తువులు కుట్టించటమే కాకుండా, ఒకటో రెండో నగలుకూడా చేయించేవారు. రంజాన్, బక్రీద్ లాంటి పెద్ద పండుగలప్పుడు, "ఈదీ" (పండుగ కానుక) అంటూ రెండు మూడు వందలు నగదుకూడా చేతికిచ్చేవారు. ఆయనకున్న వ్యసనమల్లా రేసులు ఒక్కటే. రేసులకోసం తరచూ పై వూళ్ళకు వెళ్ళి వస్తూండేవారు. అలా వెళ్ళినప్పుడల్లా తనకు ఏదో ఒక బహుమతి తేవటం అలవాటుగా మారింది.

నవాబుగారికి తనంటే ఎందుకంత అభిమానమో, తనకోసం అంత ధనం ఎందుకు వెచ్చిస్తున్నారో, బొత్తిగా అర్థమయ్యేదికాదు రమణికి. ప్రతిఫలంగా తానిచ్చేది దాదాపు ఏమీ లేనట్టుగానే అనిపించేది. వారానికి ఒకసారి ఆయన బంగళాకెళ్ళి రెండుమూడు గంటలు మాటల్లోనూ, భోజనంలోను తోడుగా ఉండి తన పాట వినిపించటం తప్పమరేదీ చేసింది లేదు. కేవలం తన పాట మీది మోజు వల్లనా, అంటే, తనకే నమ్మకం కలగటం లేదు. మరింక దేనికి? మాటల్లోనూ, చేతల్లోనూ ఎప్పుడూ సభ్యతను దాటిపోలేదు. అసలు తనని తాకటానికే ప్రయత్నించలేదు. పండుగ పూట తను సలాం చెయ్యటానికి వెళ్ళినపుడు, తలమీద చెయ్యి వేసి ఆశీర్వదించి "ఈదీ". అందించేవారు. అంతకంటే దగ్గరి కెప్పుడూ రాలేదు.

మొదట్లో తనని "రమణీ" అని పిలిచేవారు. కాని ఒక రోజు "నీ కీ పేరు బాగులేదు. నీ అందానికి తగ్గపేరు సుందరి. అలానే పిలుస్తాను" అన్నారు. తాను చిరునవ్వు నవ్వి, అంగీకారంగా తలూపింది. మరి కొన్నాళ్ళకి, ఒకనాడు అకస్మాత్తుగా "రూహీ!"అని పిలిచారు.తాను తెల్లబోయింది.

"అవును, నిన్ను 'రూహీ' అనే పిలవాలనుకుంటున్నాను. నీకు అభ్యంతరమా ?" అని అడిగారు.

తానేమంటుంది ? తలవంచుకుని, "మీ ఇష్టం. మీరు ఎలా పిలిచినా నాకు సమ్మతమే" అంది.

అలా రెండేళ్ళు హాయిగా గడిచాయి. క్రమం తప్పకుండా గడిచాయి... ఆనాటి వరకూను.

ఆ రోజు తాను వెళ్ళేసరికి డ్రాయింగ్ రూమ్‌లో నవాబ్‌గారి ప్రక్కన మరో వ్యక్తి కూర్చుని ఉన్నాడు. తాను ద్వారం దగ్గరే ఆగిపోయింది.

"రా, రూహీ! రా... ఆగిపోయావేం ?" అంటూ ఆహ్వానించారు నవాబ్‌గారు.

లోనికి వెళ్ళి, ఇద్దరికీ సలాం చేసింది. ఆ రెండో వ్యక్తి లేచి నిలుచుని ప్రతి నమస్కారం చేశాడు.

"కూచో" అన్నారు నవాబ్‌గారు.

కూచుంది. అతనూ కూచున్నాడు.

"ఏదీ, చెప్పుకో ఇతను ఎవరో..." అన్నారు నవాబ్‌గారు చిరు నవ్వులో.

తాను సిగ్గుతో వంచిన పోతూ కొద్దిగా తలపైకెత్తి చూసింది. ఎదుట ఒక నవమన్మధాకారుడు మందహాసంతో కనిపించాడు. చకితురాలైంది! అచ్చంగా నవాబ్‌గారి పోలికలే. దాదాపు ముప్ఫై ఏళ్ళక్రితం నవాబుగారు ఇలాగే ఉండేవారనటంలో సందేహంలేదు. ఆశ్చర్యంతో నోరుతెరుచుకొని, కొద్ది క్షణాలు అలానే ఉండిపోయింది. ఎందుకో తన నిలువెల్లా విద్యుత్తు ప్రవహించినట్టనిపించింది. తేరుకుని అతికష్టం మీద దృష్టి మరల్చి, నవాబ్‌కేసి చూసింది.

"ఏం, పోల్చుకో గలిగావా?"

అనుమానంగానే తలూపింది. "మీ ...మీ .. కుమారులనుకుంటాను" అంది.

"కరెక్ట్! మావాడే. 'ఛోటే నవాబ్', 'సలీం పాషా' అని విని వుంటావు. ఇతనే. పూర్తిపేరు సలీం ఉద్దీన్ ఖాన్. ఇన్నాళ్ళూ పూనాలో ఇంజనీరింగు చదివాడు. చదువు ముగించుకుని ఈ మధ్యనే తిరిగి వచ్చేశాడు. ఇక ఇక్కడే ఉంటాడు"

ఇక్కడే ఉంటాడా? . కంపించిపోయింది. గుండె వేగంగా కొట్టుకోసాగింది. వర్ణనాతీతమైన ఒక నూతనానుభూతి పొందింది. ... కాస్త తమాయించుకుని, కళ్ళు దించేసింది.

"అవును, నాన్నగారూ! మీరు చెప్పింది అక్షరాలా నిజం."

సలీం మాటలు చెవిని సోకగానే చప్పున మళ్ళీ తలెత్తి చూసింది. సలీం తనవైపే తదేకంగా చూస్తున్నాడు. అయోమయంగా నవాబ్ గారిని చూసింది. ఆయన కళ్ళు మూసుకుని ఏదో దీర్ఘాలోచనలో మునిగి ఉన్నారు. ఏమీ అర్థం కాక తల దించేసుకుంది.

ఆ తర్వాత భోజనం, పాటా, ఫలహారం, టీ యథా ప్రకారంగానే జరిగిపోయాయి. ఆరాత్రికే నవాబ్‌గారు దేసుల కని బొంబాయి వెళ్తున్నామని, తిరిగి రావటానికి వారం పది రోజులు పట్టొచ్చనీ చెప్పారు. అది వినగానే రమణి మనస్సు చివుక్కుమంది. అన్ని రోజులూ సలీం మళ్ళీ కనిపించడు కదా అన్న భావనే బాధాకరంగా తోచింది. .. అన్యమనస్కంగానే ఇంటి కొచ్చేసింది.

రాత్రికి నిద్ర కరువై పోయింది. పదే పదే సలీం ముఖారవిందమే ముందు కొస్తోంది. అతని చూపులే తూపులై గుచ్చుకుంటున్నాయి. అతను పలికిన ఒకే ఒక్క వాక్యం—'నాన్నగారూ! మీరు చెప్పింది అక్షరాలా నిజం'—మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేసుకుంటోంది. దాని భావమేమిటో ఎంత తల బాదుకున్నా అంతు పట్టడం లేదు... బహుశా నవాబ్ గారు తన గురించి చెబుతూ, తాను చాలా అందంగా ఉంటుదని చెప్పిఉంటారు. అదే అక్షరాలా నిజం అని అతను అని ఉంటాడు. అవునా ? అవును, అంతే అయి ఉంటుంది. కాని .. కాని అతను మాత్రం ఏం తీసిపోయాడనీ? తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకోలేదా ? ఒక్క చూపులోనే తన మనస్సును పూర్తిగా దోచుకున్నాడే ? ... అబ్బ, నిజంగా ఎంత అందంగా ఉంటాడు! ... రాత్రి శివరాత్రే అయింది.

మర్నాడు బాగా పొద్దెక్కేదాకా మెలుకువ రాలేదు. ప్రొద్దటి సంగీత సాధన ఎగిరిపోయింది. బద్ధకంగా లేచింది. మందకొడిగానే దిన మంతా గడుస్తోంది. మాఇంటికి మళ్ళీ వాళ్ళుగాళ్ళొచ్చారని తెలిసినా లేవ బుద్ధి కాలేదు. వాళ్ళని తిరగ్గొట్టేసింది. అలాగే పడుకుంది— నిన్నటి మధుర స్మృతులలో వోలలాడుతూ.

ఇంతలోకి మళ్ళీ అమ్మ వచ్చింది పరుగు పరుగున. "రమణీ!రమణీ! కారొచ్చిందే, నవాబ్‌సాబ్ కారు. నిన్ను తీసుకు రమ్మన్నారట .."

చెంగున లేచి కూచుంది రమణి. అదేమిటి? నవాబ్‌గారు వెళ్ళలేదా? .. పైకేమీ అనకుండానే, గబగబా బాత్‌రూమ్‌లో దూరింది. పది నిమిషాలలో తిరి గొచ్చి డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూచుంది, ముస్తాబు కావటానికి. అర గంటలో అప్సరసలా తయారయి బయలు దేరింది. అమ్మతో ఒక్క మాటా చెప్పలేదు.

దారిలో డ్రైవర్నడిగింది, నవాబ్ సాబ్ ఊరికి వెళ్ళలేదా అని. వెళ్ళారన్నాడు. మరి, తన నెవరు పిలిపించారని అడిగింది. 'ఛోటే నవాబ్' అన్నాడు. ఒక్కసారి గుండె ఆగినంత పని అయింది. ముచ్చెమట్లు పోశాయి. నవాబుగారు లేని సమయాన తనను పిలిపించాడా సలీం? ఎందుకూ? ... అతను పిలిపించినా,తాను వెళ్ళటం బాగుంటుందా? అమ్మతో చెప్పాల్సింది. చెపితే, తప్పకుండా అమ్మ కూడా వెంట వచ్చేది. ఉహుం, తన కది ఇష్టంలేదు. మరి ... మరి, తానిప్పు డేంచెయ్యాలి ? ముందుకు వెళ్ళాలా, వద్దా అన్న సందిగ్ధావస్థలో పడ్డది. క్షణం సేపు కారాపి తిరిగి ఇంటిముఖం పట్టాలని అనుకుంది. కాని వెంటనే ఆ తలంపును వెనక్కి నెట్టి వేసింది. ... ఇంతకూ, ఎందుకు పిలిపించాడో? తన పాట వినటానికా? సంగీతంలో అంత ఆసక్తిగల వాడిలా కనిపించలేదే? మరే ?... ఎన్నో వూహలు వూరించాయి. వాటి మైకంలో ఒళ్ళు గగుర్పొడిచింది ... ఇంక ఆలోచనలు ఆపుచేసి ముందగా ముందుకు సాగిపోయింది.

గదిలో అడుగు పెట్టేటప్పుడు కాళ్ళు వణికాయి. గుండె దడ హెచ్చింది. ఎదురుగా సలీం లేచి నిల్చుని ఆహ్వానిస్తున్నాడు.

"ఆదాబ్, రండి, రండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాను."

తాను ప్రతి నమస్కారం చెప్పడం మరిచిపోయింది. నలువేపులా దృక్కులు ప్రసరించింది. గదిలో ఇంకెవ్వరూ లేరు.

"రండి, అలా కూచోండి," అంటూ సోఫా చూపిస్తూ అన్నాడు సలీం.

అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి కూచుంది. అతనూ కూచున్నాడు.

"నాన్నగారు నిన్ననే బొంబాయి వెళ్ళారు. మీకు తెలుసుగా?"

తెలుసన్నట్టు తలూపింది.

"నాన్నగారు లేనప్పుడు మిమ్మల్ని పిలిపించటం మీకు ఇష్టంగా లేదా?"

తానేం జవాబు చెప్పాలో తోచలేదు. ఇబ్బందిగా కదిలింది.

"పోనీ, ఇష్టం లేకపోతే చెప్పండి, కారు తెప్పిస్తాను—మీరు వెళ్ళిపోవచ్చు..."

ఉలిక్కి పడ్డది. దిగ్గున తల పైకెత్తి, లేదు, లేదన్నట్టు తలూపింది.

అతను సంతృప్తిగా మందహాసం చేశాడు. తాను అప్రయత్నంగా నవ్వేసింది.

సలీం చప్పట్లు కొట్టాడు. వెంటనే నౌకరు ట్రేలో పళ్ళు, ఫలహారాలూ, టీ, పాలు పట్టుకొచ్చి వాళ్ళ ముందున్న టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు. సలీం పేస్ట్రీ రమణి ముందుకు తెచ్చాడు. ఒక్క ముక్క అందుకుంది. సలీం ఆపిల్ పండు ముక్కలు కొయ్యటం మొదలు పెట్టాడు.

"నిన్న మీరు అంత బాగా మాట్లాడారు, అంత బాగా పాడారు. మరి ఇవ్వాళ ఒక్క మాటా మాట్లాడటం లేదు?" అన్నాడు.

"ఏం మాట్లాడను ?"

"మీ ఇష్టం. మీరు ఏం మాట్లాడినా వినాలని ఉంది నాకు......పోనీ, ఇది చెప్పండి. మీరు ఇంత స్వచ్ఛమైన ఉర్దూ ఏలా మాట్లాడగలుగుతున్నారు? అది మీ మాతృభాష కాదుగా ?"

"కాదు. కాని గజళ్ళకు కావాలిగా, అందుకని "

"అందుకని?"

"ఒక మౌల్వీసాబ్ (గురువుగారు) దగ్గర నేర్చుకుంటున్నాను."

"ఇప్పటికీనా?"

"ఆ,...ఇప్పటికీ."

కొంచెం ఆగి అన్నాడు : "మీరేమీ అనుకోకపోతే నే నొకటి చెబుతాను"

"చెప్పండి"

"నే నిన్నాళ్ళూ పూనాలో ఉన్నానుగా. గజళ్ళతో పరిచయం పోయింది. నా మన సిప్పుడు సినిమా పాటల మీదికే పోతుంది."

"సినిమా పాటలు కూడా బాగానే ఉంటాయి."

"మీరు పాడుతారా?" ఆశగా అడిగాడు.

"లేదు, మా అమ్మ పాడనివ్వదు."

"ఓ..." అన్నాడు, నిరుత్సాహపడిపోయి, "నిజంగా మీరా పాటలు పాడగలిగితే నూర్ జహాన్ను మించి పోయేవారు."

చిరునవ్వు నవ్వి మౌనంగా ఉండిపోయింది రమణి.

సలీం టీ కలుపుతూ అడిగాడు, "ఎంత చక్కెర వెయ్యమన్నారు?"

"మీ ఇష్టం"

"అయితే అంతా మీ కప్పులోనే వేస్తాను" అన్నాడు నవ్వుతూ. రమణి నవ్వింది. రెండు చెమ్చాలు వేసి కప్పు అందించాడు. తాను ఒక కప్పు అందుకున్నాడు. ఇద్దరూ సిప్ చేస్తూ కూచున్నారు.

ఉన్నట్లుండి, సలీం "రూహీగారూ!" అన్నాడు.

"నా పేరు రమణి" అంది మెల్లిగా.

"కావచ్చు. కాని నాన్నగారు మీకు ఆ పేరు పెట్టారు. మా ఇద్దరికీ ఆ పేరే నచ్చింది."

రమణి మాట్లాడలేదు.

"రూహీగారూ!" మళ్ళీ అంటున్నాడు సలీం.

"ఇవ్వాళ నేను మిమ్మల్ని ఎందుకు పిలిపించానో అర్థంకాక మీలో మీరే సతమతమవుతున్నారు కదూ?"

రమణి జవాబేమీ ఇవ్వలేదు.

"మీకు అభ్యంతరం లేకపోతే, ఒకమాటు నాతోపాటు లోపలి కొస్తారా ?..."

రమణి చివ్వున చూసింది అతని కళ్ళలోకి. అక్కడ అభ్యర్థన కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. తన దేహమంతా వేడెక్కి పోయింది...

"మీరు భయపడకండి. మీకే హానీ కలిగించను."

కలిగించరా? కలిగించాలని కోరుకుంటోంది తన మనస్సు? ఆ రోజు తాను అన్నిటికీ సిద్ధంగా ఉంది...

వణికే చేతులతో కప్పును పెట్టేసి, లేచి నిలుచుని "పదండి" అంది ధైర్యంగా.

సలీం సంతోషంగా లేచి దారి తీశాడు. అదురుతున్న ఎదను అదిమి పట్టి, తడపడే అడుగులతో అనుసరించింది రమణి.

పక్క గదిలో కెళ్ళారు. అది రమణికి పరిచయమైన గదే, భోజనాల గది. అక్కడెవ్వరూ లేరు. నౌకర్లంతా ఎక్కడున్నారో ఏమో. ఇంకా ముందుకు వెళ్ళి, గుమ్మానికున్న పట్టు పరదా తొలగించి, దారి చూపించాడు సలీం. ఒకసారి సలీం కళ్ళలోకి సూటిగా చూసి, తల వంచుకుని, గదిలోకి అడుగు పెట్టింది రమణి. అంతా చీకటిగా ఉంది. వెంటనే వెనక నుంచి సలీం

వచ్చి స్విచ్చి వేశాడు, గదంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. కలయ చూసింది రమణి. విశాలమైన గది. నేలంతా మెత్తని మఖమల్ తివాచీ పరిచి ఉంది. గుమ్మాలకు,కిటికీలకు రంగు రంగుల పరదాలు వేళ్ళాడ వేసి ఉన్నాయి. ఒకవేపు ఒక పెద్ద పట్టె మంచం ఉంది. దానిమీద గులాబి రంగు దోమతెర వేసి ఉంది.

"ఇలా రండి" అంటూ ముందుకు నడిచాడు సలీం. ఎదురుగా గోడ దగ్గరకెళ్ళి చెయ్యెత్తి చూపాడు. అయోమయంగా చూసింది రమణి. ఆ గోడ కొక పెద్ద ఫోటో తగిలించి ఉంది.

"మా అమ్మగారు" అంటూ చేతులు కట్టుకుని తల వంచుకుని నిల్చున్నాడు సలీం.

పరిశీలనగా చూసింది. రంగు రంగుల దుస్తుల్లో, ఆభరణాలతో అల రారుతూన్న ఒక ప్రౌఢస్త్రీ ఫోటో అది. ఆమె కళ్ళలో కరుణ రసం ఉట్టి పడుతోంది. అలానే చూస్తూ ఉండిపోయింది రమణి.

"ఇటు రండి" అంటూ మరో వైపు దారి తీశాడు సలీం. అక్కడ మూలకు ఎత్తైన ఫ్లవర్ స్టాండ్ ఉంది. దాని మీద పూల తొట్టికి బదులు ఒక ఫోటో ఉంది. ఆ ఫోటోలోని మనిషిని చూడగానే చకితురాలైంది రమణి. అది తన ఫోటో. అవును, సందేహం లేదు. తన ఫోటోనే. కాని, తన ఫోటో ఇక్కడి కెలా వచ్చింది? తాను అలాంటి ఫోటో దిగినట్టుగా కూడా జ్ఞాపకం లేదు. మరి? ఏమీ అర్థం కాక సలీం దిక్కు చూసింది, ప్రశ్నార్థకంగా.

"అది మీ ఫోటో అని భ్రమ పడుతున్నారు కదూ?" అన్నాడు సలీం, చిన్నగా నవ్వుతూ.

"కాదా?"

"కాదు... అది మా రూహీ ఆపా (అక్కయ్య) ఫోటో"

"రూహీఆపా!"

"అవును, మా అక్కయ్య రీహానా. మేమంతా ముద్దుగా 'రూహీ' అని పిలిచే రీహానా ."

"మీకు...మీకు...అక్కయ్య ఉందని...?"

"ఉండేది. ఇప్పుడు లేదు. మా అమ్మ కాలం చేసిన నెలలోనే ఆమె పోయింది" అంటున్నాడు సలీం రుద్ధ కంఠంతో.

రమణి వణికిపోయింది. తల దిమ్మెక్కింది. మొహం నిండా చెమటలు క్రమ్మాయి. కాళ్ళలో సత్తువే లేనట్లనిపించింది. పడిపోతుందేమోనని భయం వేసింది. గిరుక్కున వెనక్కు తిరిగి, పరదా తొలగించుకుని ఈవల పడ్డది. సరాసరి డ్రాయింగు రూమ్‌లోకి వచ్చేసి సోఫాలో చతికిల పడ్డది. వెను వెంటనే సలీం వడివడిగా వచ్చాడు, "ఏమైంది? ఏమైంది?" అంటూ.

"ఇవిగో, ఇవి తాగండి, సర్దుకుంటుంది" అని గ్లాసులో చల్లని మంచినీళ్ళు పోసి అందించాడు. గటగట త్రాగేసి, బ్యాగులో నుంచి కర్చీఫ్ తీసి మొహానికి అద్దుకుంది. కాస్త కుదుట పడ్డది.

ఫాన్ వేసి, ఎదురుగా కూచున్నాడు సలీం. "ఎలా ఉంది?... డాక్టర్ని పిలిపించనా?"

"వద్దొద్దు బాగానే ఉన్నాను" అంది రమణి.

"అసలు ఏమైంది?" అమాయకంగా అడిగాడు.

"ఏం కాలేదు. అక్కడ అక్కడ వూపిరాడక .. ఇపుడు ఫరవా లేదు."

"ఓ . " అన్నాడు. కొంచెం ఆగి మళ్ళీ అన్నాడు సలీం,"ఇప్పుడు అర్థం అయి ఉంటుంది, నాన్నగారు మిమ్మల్ని రూహీ అని ఎందుకు పిలిచే వారో, మీరంటే ఎందు కంత ఆపేక్షో.. "

రమణి ఏమీ మాట్లాడలేదు. నేలను చూస్తూ కూచుంది.

"చూడండీ, మీరు నాకంటే పెద్దవారో, చిన్నవారో నాకు తెలియదు. బహుశా చిన్నవారే అయి ఉంటారు. అయినా మిమ్మల్ని 'రూహీఆపా' అనే పిలవాలనిపిస్తోంది."

రమణి దిగ్గున లేచి నిల్చుంది. "దయచేసి కారు తెప్పించండి. ఇంటికి వెళ్ళాలి" అంది, సలీం దృష్టి తప్పించి.

సలీం కూడా మెల్లిగా లేచాడు. కొన్ని క్షణాలపాటు దీనంగా ఆమె మొహంలోకి చూసి, "సరే" అంటూ వెళ్ళి డ్రైవరును కేకేశాడు.

కారు వచ్చీ రావటంతోనే గబగబా వెళ్ళి తానే తలుపు తెరుచుకుని, కూచుని, గభాల్న తలుపు వేసేసుకుంది. వరండాలో దిగాలుగా నిలుచుని చెయ్యి వూపుతూన్న సలీంవైపు తిరిగైనా చూడలేదు రమణి... కాదు రూహీఆపా......